పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

- రూ. 3.02 కోట్ల లక్ష్యం
- రూ.1.83 కోట్లు వసూలు
- రాబట్టాల్సిన పన్నులు రూ.1.19 కోట్లు
- వంద శాతం రాబట్టేందుకు చర్యలు
- మొండి బకాయిదారులకు నోటీసులు జారీ



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

బాన్సువాడ : ఆస్తి పన్నుల వసూలుపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చిలో ముగియనుండటంతో గడువు లోపు వంద శాతం రాబట్టడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు. మొండి బకాయిలపై నజర్ పెట్టారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో 19 వార్డులున్నాయి. 38,924 వేల జనాభా ఉంది. పుర పరిధిలో 8,886 గృహాలు, 960 వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వీటి నుంచి సుమారు రూ.3.02 కోట్ల పన్నులు వసూలు కావాల్సి ఉంది. అయితే ఇందులో ఇప్పటి వరకు 45 శాతం లోపు అంటే 4,280 గృహాలు, వ్యాపార సముదాయాల నుంచి రూ.1.83 కోట్లు వసూలు చేశారు.

ప్రత్యేక డ్రైవ్...

మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో వంద శాతం పన్ను వసూలు చేసేందుకు మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఫంక్షన్ హాల్స్, పెట్రోల్ బంకులు, సినిమా హాళ్లు, వ్యాపార సముదాయాలు, ఇళ్ల నుంచి పన్నులు వసూలు చేస్తున్నారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించారు. నోటీసులు జారీ చేస్తున్నారు.

చర్యలు చేపట్టాం

ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు వంద శాతం పన్నులు వసూలు చేస్తాం. అందుకు ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేశాం. ప్రస్తుత పన్నుతో పాటు , బకాయిలు రాబట్టేందుకు కృషి చేస్తున్నాం. పుర ప్రజలు సకాలంలో పన్ను చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాలి.

– శ్రీహరి రాజు, కమిషనర్, బాన్సువాడ

పెచ్చులూడుతున్న 'డబుల్' ఇళ్లు

- ఇళ్లలో ఉండేందుకు జంకుతున్న జనం
- నాణ్యతతో నిర్మించకపోవడమే కారణం



పెచ్చులూడిన తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్లు

బాన్సువాడ : పేదల సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం ప్రవేశపెట్టింది. గత ప్రభుత్వ హయాంలో బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని తాడ్కోల్ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు ప్రస్తుతం పెచ్చులూడుతున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి స్పీకర్, ప్రస్తుత వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక కృషితో నియోజకవర్గంలో 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. పది కాలాల పాటు ఉండాల్సిన ఇళ్లు ఇప్పుడే పగుళ్లు వచ్చి, పెచ్చులూడుతున్నాయి. ఇళ్లు నిర్మించిన కాంట్రాక్టర్లు పనులను నాణ్యతతో చేపట్టకపోవడంతో వర్షాకాలంలో ఇళ్లలోకి వర్షపు నీరు సైతం వస్తోంది. ఇళ్లలో నేల పూర్తిగా మట్టిగా మారిపోవడం దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి పెచ్చులూడిపోయిన, పగుళ్ల ఏర్పడిన ఇళ్లకు మరమ్మతులు చేయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



కామారెడ్డి అర్బన్: పట్టణ పెద్ద చెరువు సమీపంలోని వైద్యనాథేశ్వరస్వామి ఆలయం నిర్మాణానికి శనిశెట్టి రాజేశ్వర్, నవీన్‌లు రూ.25వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో వేద పండితులు జి. ఆంజనేయశర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు లింగాగౌడ్, బాల్‌కిషన్, యాద అనిల్‌కుమార్, శ్రీనివాస్, చారి, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ప్రతిభా పరీక్షలకు ఎంపిక



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ ప్రతిభా పరీక్షకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గాంధీ బుధవారం తెలిపారు. ఎల్లారెడ్డిలో నిర్వహించిన మండల స్థాయి ఫిజికల్ సైన్స్ ప్రతిభా పరీక్షలో మోడల్ స్కూల్ విద్యార్థులు పావని, మానస, అక్షరలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వారికి బహుమతులను అందించి అభినందించారు. ఉపాధ్యాయులు జహంగీర్, రాజశేఖర్, లక్ష్మణ్‌సింగ్, బల్వంత్ రావు, విద్యారమణ తదితరులున్నారు.

అభినందనలు



కామారెడ్డి అర్బన్: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్ల భాష నైపుణ్యం పెంచుకోవడానికి నెల రోజుల శిక్షణ తీసుకున్న ఇద్దరు కళాశాల డిగ్రీ విద్యార్థులు జి.నిత్య, బి.రాకేష్‌లను కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కే.విజయ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి జి.చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ జాగరణ మేళా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



భిక్కనూరు: కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 11 నుంచి 16 వరకు నిర్వహించనున్న స్వదేశీ మేళా పోస్టర్లను సౌత్‌క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు విషయాల గురించి ఈ మేళాలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కన్వీనర్ వంగ రాహుల్, విభాగ విచారక్ యాలాద్రి, సంఘర్షణ ప్రముఖ్ సంతోష్‌గౌడ్, మెదక్ జిల్లా కన్వీనర్ నారాయణ గుప్తా పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు ఐవీఎఫ్ పురస్కారం



కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధి తో బాధపడే చి న్నారుల కోసం రక్తదాన శిబిరా లు నిర్వహించినందుకు కామారెడ్డి శ్రీకల్కి మానవసేవా సమితి నిర్వాహకులు ఎర్రం చంద్రశేఖర్ ఐవీఎఫ్ ఉత్తమ సామాజిక సేవా పురస్కారం పొందారు. బుధవారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ ఎన్.బాలు పురస్కారం అందజేసి చంద్రశేఖర్‌ను అభినందించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా చంద్రశేఖర్ రక్తదాన శిబిరాలతో పాటు కోటి మందికి అన్నదానం చేయాలని సంకల్పం పెట్టుకుని.. ప్రతి పౌర్ణమికి దాతల సహకారంతో అన్నదానం చేయడం అభినందనీయమని బాలు ప్రశంసించారు.

పంటల నమోదు

బీబీపేట: జనగామలో బుధవారం పంటల నమోదు కార్యక్రమం నిర్వహించారు. రైతులు తాము ఏయే పంటలు వేశారో క్లసర్ స్థాయి వ్యవసాయాధికారులకు తెలియజేయాలని ఏవో నరేందర్ సూచించారు. ఇప్పటి వరకు మాందాపూర్ క్లస్టర్ పరిధిలో ఉన్నటువంటి జనగామ గ్రామంలో సుమారు 50 ఎకరాల్లో పంటలను నమోదు చేశారు. ప్రస్తుతం వరి పొలంలో సోకుతున్న మొగి పురుగు పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, వరి పొలాన్ని ఆరబెడుతూ నీళ్లు పెట్టాలని రైతులకు తెలిపారు. ఏఈవో రాజేశ్, తదితరులు ఉన్నారు.

పచ్చని చెట్లపై పగబట్టారు



నిజాంసాగర్ ప్రధాన కాలువపై నరికివేతకు గురైన చెట్లు

బాన్సువాడ రూరల్: ప్రభుత్వం ఓవైపు హరితహారం, వన మహోత్సవం పేరిట లక్షలాది మొక్కలను నాటి సంరక్షించాలని చెబుతుంటే, దానికి విరుద్ధంగా కొంత మంది పచ్చదనాన్ని కనుమరుగు చేసే ప్రయత్నంలో పడ్డారు. పచ్చని చెట్లపై కన్నేసిన ఇటుక భట్టీల నిర్వాహకులు, కట్టెలు, ఫర్నిచర్ వ్యాపారం చేసే పలువురు ఓ పద్ధతి ప్రకారం నరికివేస్తున్నారు. కొందరు అటవీహక్కుల చట్టం ప్రకారం పోడుభూమి పట్టాలు పొందటానికి ఆ శాఖాధికారుల సహాయంతోనే అడవిలో మైదాన ప్రాంతాన్ని గుర్తించి చెట్లను నరికివేస్తూ పంటల సాగుకు ఉపక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిజాంసాగర్ ప్రధాన కాలువ విస్తరణ సమయంలో కాలువకు ఇరువైపులా మిగిలిపోయిన భారీ చెట్లను పదుల సంఖ్యలో నరికివేసి అక్కడే ఎండబెట్టినా అటువైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలో పర్యటించి చెట్లను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్రం చిన్నచూపు'



జిల్లా కేంద్రంలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

కామారెడ్డి టౌన్: ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రంపై చిన్నచూపు చూశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ముందు సీపీఐ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఉపాధిహామీ పథకానికి కేవలం రూ.86 వేల కోట్లు కేటాయించడం సరికాదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఏదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల పథకాలన్ని వెంటనే అమలు చేయాలని లేకుంటే ఉద్యమాలకు సిద్ధమవుతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నేతలు దశరథ్, దుబాసి రాములు, రాజశేఖర్, శంకర్, రాజమణి, మల్లేష్, దేవయ్య తదితరులున్నారు.

పశువుల దాహం తీరేదెలా..?



పెద్దకొడప్‌గల్(జుక్కల్): నీళ్లు దొరక్క పశువుల దాహం తీర్చేందుకు చాలా ఇబ్బంది పడుతున్నామని పశువుల పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్దార్ తండాలో చాలా మంది పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టి నిరుపయోగంగా ఉండడంతో పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా స్పందించి నీటి తొట్టెను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



లింగంపేటలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు



ఇందిరానగర్‌లో జెడ్పీహెచ్‌ఎస్‌లో అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

లింగంపేట(ఎల్లారెడ్డి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై ప్రకాష్‌నాయక్ ఆధ్వర్యంలో లింగంపేట గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో గ్రామస్తులు, వాహన చోదకులకు నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దని, ఆన్‌లైన్ లింక్‌లు ఓపెన్ చేయవద్దన్నారు. అలాగే లాటరీలు, లోన్‌లు ఇస్తామని ఫోన్ ద్వారా బ్యాంక్ ఖాతాలు అడిగితే ఇవ్వవద్దన్నారు. ఇటీవల ఆన్‌లైన్ మోసాలకు గురై ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్న ఘటనలు వివరించారు. అలాగే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కానిస్టేబుల్ రమేశ్‌రెడ్డి, శంకర్, హోంగార్డు హమీద్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ జెడ్పీహెచ్ఎస్‌లో..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌కాలనీ జెడ్పీహెచ్‌ఎస్‌లో సైబర్ జాగృత దివస్ సందర్భంగా విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్, పిరమిడ్ మార్కెటింగ్, జంపుడ్ డిపాజిట్, డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్స్, బ్యాంకుల నుంచి నకిలీ కాల్స్, ఇన్వెస్ట్‌మెంట్ తదితర మోసాలపై అవగాహన కల్పించారు. మోసపోతే తక్షణమే 1930కు కాల్ చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ విభాగపు కానిస్టేబుల్ ప్రవీణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కొనసాగుతున్న కన్యకాపరమేశ్వరి ఉత్సవాలు



బీబీపేట: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న కన్యకా పరమేశ్వరి ఉత్సవాలు రెండో రోజు ఘనంగా కొనసాగాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కలశాలతో నీళ్లను తీసుకొచ్చి విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరం కోలాటం ఆడారు.

పురాణ ప్రవచన సప్తాహం



దోమకొండ: మండల కేంద్రంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో బుధవారం పురాణ ప్రవచన సప్తాహం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా ధర్మపురికి చెందిన వేద పండితులు కొరిడె విశ్వనాథ శర్మ ప్రవచనాలను భక్తులకు వినిపించారు. మండల కేంద్రంతో పాటు వివిధగ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో హోమం

భిక్కనూరు: అంతంపల్లిలోని పెద్దమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు.

బగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని బగళాముఖి అమ్మవారి పీఠంలో అమ్మవారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాఘమాసంలోని అష్టమిని పురస్కరించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. జ్యోతిష్య పండితులు క్రాంతిపటేల్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

కౌలాస్‌లో రథోత్సవం



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం కౌలాస్‌లో రథసప్తమి సందర్భంగా రథోత్సవం ఘనంగా నిర్వహించారు. బసవ లింగస్వామి ఆధ్వర్యంలో రథోత్సవం, అగ్ని గుండం ప్రదర్శన జరిపారు. గ్రామ మాజీ సర్పంచ్ హన్మాండ్లు యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ ఉమాకాంత్ దేశాయ్ ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు శాశ్వత పరిష్కారం'



నిజాంసాగర్(జుక్కల్): సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ విషయంలో శాశ్వత పరిష్కారానికి కృషి చేశారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో బాబాసాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రావ్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, బడుగు, దళిత వర్గాల పట్ల ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎంకే దక్కిందన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 10, 11వ తేదీలలో కర్షక్ బీఈడీ కళాశాలలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా ఐదో మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభల్లో చర్చలు జరిపి భవిష్యత్తు పోరాటాలను రూపొందిస్తామని అరుణ్ తెలిపారు. నాయకులు రాహుల్, సన్నీ, ప్రశాంత్, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో కార్మికులకు అన్యాయం జరిగింది'



కామారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులు, కర్షకులకు అన్యాయం జరిగిందని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడారు. సంపన్న వర్గాలకు మేలు జరిగేలా బడ్జెట్ రూపకల్పన చేశారని మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజనర్సు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల వల్లే పార్టీకి ప్రజల్లో మంచి పేరు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు



నీలం చిన్నరాజులును సన్మానిస్తున్న భిక్కనూరు మండల బీజేపీ సీనియర్ నేతలు

భిక్కనూరు: పార్టీకి కార్యకర్తల వల్లే ప్రజల్లో మంచి పేరు, గుర్తింపు వస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అన్నారు. బుధవారం భిక్కనూరు మండల కేంద్రంలో ఆయనను బీజేపీ నేతలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తా ప్రతి రోజు గంట పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారి ఇళ్లకు వెళ్లి సమస్యలను తెలుసుకుని ప్రధాని మోదీ సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. ప్రజల్లో ఉండే కార్యకర్తలను పార్టీ గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు తీవ్రంగా కృషి చేయాలని సూచించారు. నేతలు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలి



భిక్కనూరు: ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒక్కసారి కంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రభుత్వ కంటి వైద్యుడు రవీందర్ పటేల్ సూచించారు. బుధవారం భిక్కనూరు ప్రభుత్వాస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 235 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలను అందజేశారు. 23 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి వారికి కామారెడ్డి ఆస్పత్రికి సిఫారసు చేశారు.

గుట్ట చదును పనుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లికలాన్ శివారులో గల సర్వే నెంబర్-230లోని గుట్టపై చేపట్టిన చదును పనులను బుధవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐ మహ్మద్ పరిశీలించారు. చదును పనులకు సంబంధించి బుధవారం పలు దినపత్రికల్లో ప్రచురితమైన కథనాలకు వారు స్పందించారు. గుట్ట వద్ద ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టవద్దని వారు సూచించారు. జూనియర్ అసిస్టెంట్ సాయిలు ఉన్నారు.

విహార యాత్రకు గురుకుల విద్యార్థినులు



వేయిస్తంభాల గుడి వద్ద విద్యార్థినులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు పీఎంశ్రీ పథకం కింద విహార యాత్రకు వెళ్లారు. తెలంగాణా రాష్ట్రంలోని వేయిస్తంభాల గుడి, సమ్మక్క సారక్క, భద్రకాళి ఆలయాలతో పాటు లక్నోవరానికి ఈ సందర్భంగా వెళ్లారు. ప్రిన్స్‌పల్ సురేఖ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పారిశుధ్య పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బుధవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. వీధుల్లో చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్‌యార్డుకు తరలించాలని సూచించారు. కార్యదర్శి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

పిల్లలకు తప్పకుండా టీకాలు వేయించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): చిన్నపిల్లలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని హెల్త్ సూపర్‌వైజర్ సుభాషిణి సూచించారు. బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారము ఆమె వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియను పరిశీలించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డిరూరల్: భిక్కనూర్ గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంగ్రెస్ నాయకులు వాసవి, మండల పార్టీ అధ్యక్షులు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల వెల్లడి

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆటానమస్ హోదా పొందిన తర్వాత తొలిసారి బుధవారం 2024-25 తొలి సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల స్వామి వెల్లడించారు. ఈసందర్భంగా తెలంగాణ యూనివర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి, ప్రొఫెసర్ అరుణ మాట్లాడుతూ.. పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసిన ప్రిన్సిపల్‌ను అభినందిస్తున్నామన్నారు. అలాగే ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ షేక్ అక్బర్ పాషా, పరీక్షల అదనపు కంట్రోలర్ అంబయ్య, మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రానున్న వేసవిలో గ్రామాలలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్ అన్నారు. ఆయన బుధవారం తాడ్వాయి మండల కేంద్రంలో తాగునీటికి సంబంధించిన పైపులైను, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, కారోబారులు ప్రతి వార్డులో తిరుగుతూ తాగునీటి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. ఓపెన్ బావులలో చెత్తాచెదారం ఉన్నట్లయితే వెంటనే తొలగించి శుభ్రం చేయాలని పేర్కొన్నారు. కార్యదర్శి బాలు, కారోబార్ స్వామి, సిబ్బంది గంగారాం, రాములు ఉన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీవో ప్రకాష్ అన్నారు. బుధవారం అన్నాసాగర్, అజామాబాద్, తిమ్మారెడ్డి గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

హుండీల లెక్కింపు

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో దేవాదాయ సహాయ కమిషనర్ రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం హుండీలను లెక్కించారు. 3 నెలలకు సంబంధించిన హుండీలను లెక్కించగా రూ.5 లక్షల 27 వేల 870 వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీధర్‌రావు తెలిపారు. ఆలయ అర్చకులు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, అక్కాపూర్ గ్రామసేవా సమితి సభ్యులు ఉన్నారు.